


# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



7

# గోచీకి సంచీ పథకం

గత ఏప్రిల్ నెలలో బుద్ధి పొరపాటున ఆంధ్రా వెళ్లాను. అదే హైదరాబాద్ అయితే పరవాలేదు. ప్రభుత్వం వారివీ, ప్రతి పక్షాల వారివీ ఆఫీసులూ, కుటుంబాలూ, సెట్-అప్ లూ అన్నీ హైదరాబాద్ లో ఉంటాయి కాబట్టి కరెంట్ కోత లేకుండా జాగ్రత్త పడతారు. అదే మా కాకినాడలో రోజుకు గంట మాత్రమే కరెంట్ ఉంది. మిగిలిన ఇరవై మూడు గంటలూ అంధకారము మరియు విపరీతమైన వేడి. నగరం మధ్యలో సిమెంటు బిల్డింగుల మధ్య ఉంటే ఇలాగే అవస్థ పడాలి కదా, హాయిగా మా పొలం వెళ్లి , అక్కడ ఒక రోజు గడిపితే బావుంటుందేమో అనిపించింది. ఎందుకంటే అక్కడ ఎయిర్ కండిషన్లు అక్కర లేదు. మా మకాం ముందు ఉన్న పందిట్లో కుర్చీలు వేసుకుని కూచుంటే మా చెరువు మీద నుంచి హాయిగా చల్లటి గాలి వేస్తుంది. ఎదురుగా పచ్చటి పొలాలు. పైగా అవి దాళవా పంట కోతల రోజులు. మరొక రెండు ఎకరాలలో ఏపుగా పెరిగిన చెరుకు తోటలు. వారేవా...అక్కడికి వెళ్తే నా చిన్నప్పటి సంగతులన్నీ గుర్తుకొచ్చి ఈ ప్రపంచాన్నీ, పని చెయ్యని ప్రభుత్వాన్నీ, పవర్ కట్ లనీ మర్చిపోవచ్చు కదా అనుకున్న నా ఆలోచన పూర్తిగా దెబ్బ తినేసింది.

మా పొలాలకి వెళ్ళాలంటే గొల్లప్రోలు దగ్గర మెయిన్ రోడ్ మీద నుంచి సైడ్ రోడ్ తీసుకుని , తాడిపర్తి గ్రామం దాటి, బదరీనాథ్, కేదార్ నాథ్ రోడ్ లాంటి సన్నటి తాటిపర్తి చెరువు గట్టు మీద నుంచి వెళ్ళాలి. నేను పుట్టినప్పటి నుంచీ ఇప్పటి దాకా ఆ చెరువులో ఒక్క నీటి చుక్క నేను ఎప్పుడూ చూడలేదు. కానీ మొన్న వెళ్లినప్పుడు చెరువు లో ఒక నీటి గొట్టాం భూమి లోంచి పది అడుగులు తన్నుకొచ్చి కనపడుతోంది. గొట్టాం లోంచి నీళ్ళు రావడం లేదు కానీ చివరన ఒక పతాకం రెపరెప లాడుతూ ఆవేశంగా ఎగురుతోంది. "ఏమా గొట్టాము, ఏమా కథ?" అని మా డ్రైవర్ రాముడిని అడిగాను.

"అదాండీ, అదండీ ..మొన్న మినిస్టర్ గారు ఒచ్చారు కదండీ ..ఆయన దిగేసిన గొట్టం అండి...ఇందిరమ్మ జలప్రభ పడక....లో"

"ఇందిరమ్మ జల పడకా? అంటే" బుర్ర గోక్కున్నాను.

“పడక్కాదండి....పెదకం అండి.ఆయ్..ఈ మధ్య మంత్రులు, ఎమ్మెల్యేలు ఒచ్చేసి,..ఎక్కడ పడితే అక్కడ బోరు గొట్టాలు భూమిలో కొట్టేసి, పైన జలప్రభ జెండా కట్టేసి ఫోటోలు దిగేసి, టీవీలలో తెగ పడిపోతన్నారండి ఆయ్...ఇయన్నీ అమెరికాలో సూపించరేటండీ ..ఆయ్” అని వివరించాడు డ్రైవర్ రాముడు.

“మరి మన ఊళ్ళో మూడు వందల అడుగులు తవ్వితే కానీ నీరు పడదుగా..మరి ఈ బోరు గొట్టాం ఆమాట లోతుకే ఉందా?” అమాయకంగా అడిగాను.

“ఆయన్నీ ఎవడిక్కావాలి సార్...మంత్రి గారు ఉన్న కాస్సేపు ఆయనే గొట్టం మీద సేయ్యేస్తారండి. జెండా ఎగరగానే గొయ్యి కప్పెట్టేసి అందరూ ఇంకో ఊరు ఎలిపోతారండి. రోజుకి నాలుగు గొట్టాలు దిగాలని ఆరికి కిరణ్ కుమార్ గారు కోటా ఎట్టారండి. ఆయ్యు..”

అపటికే మేము చెరువు గట్టు దిగిపోయి, చిన జగ్గం పేట ఊరులోంచి మా పొలాల లోకి వచ్చేసాం. పెద్ద రావి చెట్టు దగ్గర వెలిసిన మా పొలం దేవత సత్తెమ్మ తల్లికి దణ్ణం పెట్టుకుని మా మకాం ముందు పందిట్లో నేను బిచాణా పెట్టి ఎదురుగుండా ఉన్న మడిలో వరి మొక్కలు కోస్తున్న ఇరవై మందినీ తన్మయత్వంగా చూస్తున్నాను. అసలు ఆ సీను కోసమే కదా నగరం నుంచి పారిపోయి ఇక్కడికి వచ్చింది. కానీ, చూసిన కొద్దీ ఎక్కడో , ఏదో తేడా కనపడింది. మొదటగా , ఎటు వేపు నుంచీ ఏ విధమైన పాటా, గీటా, కనీసం కూని రాగం కూడా వినపడడం లేదు. యింకా పట్టు పట్టి చూస్తే ఆ గుంపులో అందరూ చెడ్డీలే వేసుకున్నారు. కాశ పోసి చీర కట్టుకున్న ఆడ కూలీయే కనపడ లేదు. ఇంతలో ఠంగున స్కూల్ బెల్ కొట్టినట్టు ఆ ఇరవై మందీ కోతలు ఆపేసి, గట్టు మీద కొచ్చి,.....నమ్మండి, నమ్మక పొండి...చేవుల్లోంచి హెడ్ ఫోన్ తీగెలు తీసేసి చుట్టేసి జేబులో పెట్టేసుకున్నారు. మగ కూలీలు సైకిల్ తియ్యగానే, వెనకాల ఆడ కూలీలు కూర్చుని, సెల్ ఫోన్లు వాడడం మొదలు పెట్టారు. ముందు ఇదేదో సినిమాలో హాస్యం సీను అనుకున్నాను. కానీ, నా కళ్ళెదురుగుండా ఈ నాటి మా పల్లె వాతావరణం చూసి నమ్మ లేక పోయాను.

“అదేమిటయ్యా, వాళ్ళు కనీసం వెళ్ళొస్తాం, అయ్యగారూ అని దణ్ణం పెట్టకుండానే వెళ్ళిపోయారు.” అని నేను ఆశ్చర్యపోయాను.

‘అదంతే నండి. పనికి ఆహార పడక ఒచ్చిన కాణ్ణించీ అన్నీ మారిపోయాయండి. ఆయ్”

“పనికి పడకా?”..మళ్ళీ బుర్ర గోక్కున్నాను.

“అదేనండి గవర్నమెంటోళ్లు ...పనికి ఆహార పెదకం పెట్టిన కాణ్ణించీ ఎవరూ పొలం పనులకి రావడం లేదండి. ఆళ్లు రోజుకి మూడొందలిస్తారండి. ఏసంకాలం పొద్దుట ఏడు నుంచి పన్నెండు దాకా నాలుగు రాళ్ళు పగలగొడితే సాలండి. ఇచ్చినోడూ, పుచ్చుకున్నోడూ కొత్త కొత్త పెదకాలు ఏసుకుని ఆ డబ్బు పంచేసుకుంటారండి. ఆయ..” అన్నాడు డ్రైవర్ రాముడు.

“మరి అందరికీ ఆ సెల్ ఫోన్లు ఎక్కడివీ ?”

"అయాండీ...అయి రాజీవ్ గోచీకి ఇందిర సంచీ పడక ..పెదకంలో ఒచ్చినయండి. పని చేసుకుంటూ పాటలు ఇనాలి కదండీ అమెరికా లోగా. ఇది వరకట్లా పొలాల్లో పాటలు పాడడం ఫేషన్ కాదండి..."

నాకు ఎందుకో కళ్ళు తిరిగినట్టు అయింది.

అదేటబ్బాయి గారు, అలా అయి పోయారు. ఆ మధ్య సోనియా గారి పుట్టిన రోజుకి కిరణ్ కుమార్ గారు ఇచ్చిన పెజెంటేషన్ సార్. అదేటంటే...అందరికీ రూపాయికి కిలో బియ్యం ఇస్తారు కదా ..కానీ ఉత్తి బియ్యం ఏం చేసుకుంటారూ.ఆళ్లు అన్నంతో తిండానికి ఇంకేమన్నా ఇయ్యి అని మన సీ ఎం గారిని సోనియా మేడం గారు కూకలేశారటండి. అప్పుడేమో సీ ఎం గారు గోచీ పెట్టుకుని ఆధార కార్డ్ చూపించినోళ్లందరూ..అంటే బీదోళ్ళన్న మాటండి.. ..ఓ ఖాళీ సంచీ పట్టుకెళ్తే సాలండి. అందులో కంది పప్పు, ఉప్పు, కారం, సింత పండు, పసుపు, గోదుం పిండి, పంచ దార..గొడవ పెట్టినోళ్ళకి సికేన్ ముక్కలూ ఎసి ఆ సంచీ నింపేసి ఇత్తా రంట. ..అదే బాబూ రాజీవ్ గోచీకి ఇందిరమ్మ సంచీ పడకం.."

అది విని నా మెదడు పాదరసం లా పని చేసింది. "మరి అందరికీ ఆ సెల్ ఫోన్లు ఉండడానికీ, ఈ గోఛీ-సంచీ లకీ సంబంధం ఏమిటీ " అని అడిగాను.

నా ప్రశ్న ముందే ఊహించినట్టే ఉన్నాడు డ్రైవర్ రాముడు. ఎన్టీవోడిలా ఒక నవ్వు నవ్వి "కిరణ్ కుమార్ గారికి తెల్వదేమో గానీ సంచీలు నింపీ ఆఫీసరోల్లకి కిరాణా దుకాణాలున్నాయి సార్. పుచ్చుకునేవోల్లకి సెల్ ఫోన్లు కావాలి కానీ ఈ సంచీలో సరుకులెందుకు సార్... ఓ కుటుంబం తాలూకు ఆర్నెల్ల సరుకులన్నీ ఎనక్కి ఇచ్చేస్తే , ఖాళీ సంచీలో సవక బారు సెల్ ఫోన్ ఏసి ఇవ్వడానికి ఆళ్ళ ఒప్పందం. మీ దయ వల్ల నేనూ ఓ సెల్లు తెచ్చుకున్నాను సార్.."

"అబ్బో, చాలా ఉందే వ్యవహారం. ఇంతకీ నా దయ వాళ్ళ నీకు సెల్లు రావడం ఏమిటీ..? అడిగాను రాముణ్ణి.

"ఏం లేదు సారూ...మీరేలాగా అక్కడెక్కడోఅమెరికాలో ఉంటారు గదా....ఏదో మీ ఫేమిలీ నలుగురికీ ఇక్కడ ఆదార్ కార్డ్ తీసుకుని గోచీ కట్టుకున్నాను సార్...మీ దయ..ఆయ"..అని రాముడు అనగానే నాకు నిజంగానే కళ్ళు తిరిగి పడిపోయాను.

"వెధవ ..ఈ ఎండ దెబ్బలకి తట్టుకో లేవురా ఇప్పుడు ఇండియా రావద్దు అని ఎంత చెప్పినా విన లేదు" అంటూ మా అన్నయ్య అర్జంటుగా నన్ను ఇందిరమ్మ జల పడక బోరు గొట్టాం దగ్గరకి తీసుకుని వెళ్ళబోతుంటే నా మినరల్ వాటర్ బాటిల్ నీళ్ళు నా మొహం మీద జల్లాడు డ్రైవర్ రాముడు. ***

మా బ్లాగ్: www.vangurifoundation.blogspot.com

COMMENTS